సాక్షి
అనకాపల్లి

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



అభివృద్ధి పరుగులు

ప్రభుత్వ విప్ ధర్మశ్రీ రావికమతం మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

IIలో



సాగరదుర్గను చూసొద్దాం..

విశాఖ: యారాడ కొండపై సాగరదుర్గ ఆలయాన్ని చూసేందుకు నవరాత్రుల్లో బోటు సౌకర్యం కల్పించారు.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న 34.8, 19న 34.6, 20న 35, 21న 35.2, 22న 34.5 డిగ్రీల మధ్య నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

అన్నపూర్ణాదేవీ నమోస్తుతే



దుర్గాదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

చోడవరం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చోడవరం పాతబస్టాండ్ దగ్గర దుర్గాదేవి ఆలయంలో మంగళవారం సహస్ర నిమ్మకాయలతో అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.

నేడు చీడికాడలో 'జగనన్నకు చెబుదాం'

మాడుగుల: మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండల కేంద్రంలో బుధవారం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, మండల ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

రొయ్యల చెరువులో విషం కలిపిన దుండగులు

- రూ.30 లక్షల విలువైన రొయ్యల మృతి



చనిపోయి నీటి పైకి తేలిన రొయ్యలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలోని ఓ రొయ్యల చెరువులో దుండగులు విషం కలపడంతో రూ.30 లక్షల విలువైన రొయ్యలు మృతి చెందాయి. దీనిపై రొయ్యల చెరువును లీజుకు తీసుకున్న వ్యాపారి కొవిరి కాశీరావు అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కలెక్టర్‌కు తన రొయ్యల చెరువుపై ఫిర్యాదు చేశాడని, అతడే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటాడని బాధితుడు ఫిర్యాదులో ఆరోపించారు. సోమవారం రాత్రి సమయంలో చెరువు వద్ద సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకునేందుకు ప్రయత్నించగా, ఒకరు దొరికారని, అతడిని విచారిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సదరు వ్యక్తే దీనికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. దీనిపై తన వద్ద ఆ వ్యక్తి వాయిస్ రికార్డులు కూడా ఉన్నట్లు పోలీసులకు తెలిపారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా కాశీరావు పోలీసులను కోరారు.

ఆయుష్మాన్‌భవ





కన్నూరుపాలెంలో ఆధునికీకరణ పనులతో అందంగా ముస్తాబవుతున్న ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి భవనం



కొరుప్రోలు ఆస్పత్రిలో పంచకర్మ థెరపీలో భాగంగా కటివస్తి చికిత్స



వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా ఆయుర్వేద మందుల పంపిణీ

- ఆయుర్వేదానికి పెరిగిన ఆదరణ
- మారుతున్న ఆస్పత్రుల రూపురేఖలు
- శరవేగంగా ఆధునికీకరణ పనులు
- కన్నూరుపాలెంలో పంచకర్మ చికిత్సకు ప్రత్యేక విభాగం

అనకాపల్లి టౌన్/కశింకోట: ఆయుర్వేద వైద్యానికి మళ్లీ ఆదరణ పెరుగుతోంది. కరోనా తర్వాత ఈ సంప్రదాయ వైద్య విధానాన్ని ఎక్కువ మంది ఆశ్రయిస్తున్నారు. ఆయుర్వేద ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్యలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఇందుకు తగ్గట్టుగా ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలో ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు, నక్కపల్లి మండలం వేంపాడు, కశింకోట మండలం కన్నూరుపాలెం గ్రామాల్లో ఆయుర్వేద ఆస్పత్రులు ఉన్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఒక్కో ఆస్పత్రిని రూ.3.5 లక్షలతో ఆధునికీకరిస్తున్నారు. అదనపు సౌకర్యాలు కల్పించి ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కశింకోట మండలంలోని కన్నూరుపాలెం ఆస్పత్రిని ఆయుర్వేదిక్ హెల్త్ అండ్ వెల్‌నెస్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలోని ఆయుష్ విభాగంలో మౌలిక వసతులకు రూ.3.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

దాతల సాయంతో..

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ప్రభుత్వం కొరుప్రోలు, వేంపాడు, కన్నూరుపాలెంలలో ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలను ఏర్పాటు చేసింది. దాతలు భూమిని సమకూర్చడంతో పెంకులతో భవనం నిర్మించి, అందులోనే వైద్య సేవలు ప్రారంభించారు. వైద్యునితోపాటు ఆరోగ్య సిబ్బందిని నియమించి సేవలందిస్తూ వచ్చారు. కాలక్రమంలో ఈ డిస్పెన్సరీ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో 2013లో ఎన్ఆర్‌హెచ్ఎం నిధులతో నూతన భవనాలను నిర్మించారు. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆయుష్మాన్ భారత్ కింద ఆయుర్వేదిక్ ఆస్పత్రులను అభివృద్ధి చేసి, సేవల్ని విస్తృత పరచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే జిల్లాలోని వేంపాడు, కొరుప్రోలు, కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రుల అభివృద్ధికి మొత్తం రూ.10.5 లక్షలు వెచ్చిస్తున్నారు.



చక చకా పనులు

జన ఆరోగ్య సమితి కమిటీని ఏర్పాటు చేసి ఆస్పత్రుల భవనాలను ఆధునికీకరించే పనులు చేపట్టారు. సుమారు నెల రోజులుగా పనులు జరుగుతున్నాయి. భవనానికి అందంగా రంగులు వేసి, పుట్టీ పెట్టి, ఆయుర్వేదిక్ స్పెషాలిటీ ఆస్పత్రి లుక్ వచ్చేలా తీర్చిదిద్దుతున్నారు. కిటికీలకు తలుపులు, మెష్ అమర్చుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణాన్ని ఎత్తు చేస్తున్నారు. పనులు త్వరలోనే పూర్తి చేసి వైద్య సేవలు మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆస్పత్రుల్లో ప్రహరీగోడ, రోగుల వాహనాల పార్కింగ్, తాగునీరు, విద్యుత్, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి వాటికి నిధులు ఖర్చు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తవుతాయని ఆస్పత్రుల వైద్యులు చెబుతున్నారు.

యోగా, ధ్యానం, పంచకర్మలు

ఆరోగ్యాన్ని పెంచే యోగాపై అవగాహన కలిగించేందుకు ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలలో శిక్షకులను నియమించారు. వారిలో ఒకరు యోగా, ధ్యానం నేర్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోగ్య మేళాలు గ్రామాల్లో విరివిగా నిర్వహించి ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలకు అవగాహన కలిగించనున్నారు. త్వరలో ఆయుర్వేద 'పంచ కర్మలు' సదుపాయాన్ని కల్పించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో కొరుప్రోలు ఆయుర్వేద ఆస్పత్రిలో మాత్రమే ఈ సదుపాయం ఉంది. కన్నూరుపాలెంలో కూడా పంచకర్మ వైద్య సదుపాయానికి వీలుగా ప్రత్యేక గదిని తీర్చిదిద్దుతున్నారు. ఆయుర్వేద ఔషధ మొక్కల పెంపకాన్ని కూడా ఆస్పత్రి ప్రాంగణంలో చేపట్టనున్నారు. దాతలు ముందుకు వచ్చి సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

కొరుప్రోలులో విస్తరించిన సేవలు

గత ఏడాది ఆగస్టులో ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు ఆయుర్వేద కేంద్రంను స్పెషలిస్ట్ వెల్‌నెస్ అండ్ పంచకర్మ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఆస్పత్రి ద్వారా పక్షవాతం, మోకాళ్లు, కీళ్ల నొప్పులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో పాటుగా పంచకర్మ చికిత్సలో అభ్యంగం, స్వేద కర్మ, పిండస్వేద కటివస్తి, జానువస్తి, గ్రీవ వస్తి, క్షారసూత్ర, అగ్రికర్మ, జలగ వైద్యంతో పాటుగా అనేక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ ప్రస్తుతం రోజుకు 40 నుంచి 45 మంది వరకూ రోగులు వస్తున్నారు.

ఆయుర్వేదానికి ఆదరణ



కరోనా తర్వాత ఆయుర్వేద వైద్యానికి ప్రజల్లో ఆదరణ పెరిగింది. ఆయుర్వేదిక్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రంగా అభివృద్ధి చేస్తుండడంతో చుట్టుపక్కల ప్రజలకు సేవలు విస్తృతంగా అందించనున్నాం. త్వరలో కన్నూరుపాలెంలో పంచకర్మ విభాగం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. ఆస్పత్రి పనులు జరుగుతుండడంతో ప్రస్తుతం ఓపీ సేవల్ని మాత్రమే అందిస్తున్నాం. దాతలు సహకరిస్తే సోలార్ విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసుకుంటాం.

–కె.లావణ్య, ఆయుష్ విభాగం వైద్యాధికారి, అనకాపల్లి ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ

నాగజ్యోతికి విద్యాశాఖ కమిషనర్ అభినందన



నాగజ్యోతిని అభినందిస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, తదితరులు

రోలుగుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని పీవీఎం నాగజ్యోతిని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అభినందించారు. నాగజ్యోతి నేపాల్‌లో ఈ నెల 5 నుంచి 9 వరకు జరిగిన సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్(ఎస్‌కేబీఎఫ్) పోటీల్లో నాలుగు పతకాలు సాధించి సత్తా చాటారు. పవర్ లిఫ్టింగ్, 100 మీటర్ల పరుగు పోటీల్లో బంగారు పతకాలు, డిస్కస్‌త్రో, జావలిన్ త్రోలో రజత పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నాగజ్యోతిని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దుశ్శాలువా, పుష్పగుచ్ఛం, ప్రశంసాపత్రంతో అభినందించారు. ఖండాంతరాల్లో కూడా క్రీడల్లో సత్తా చూపి విద్యాశాఖ, రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని అభిలషించారు. నాగజ్యోతిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది ఉపాధ్యాయులు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని, విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలవిద్య డైరెక్టర్ పి.పార్వతి, ఏపీ టెట్ జేడీ డాక్టర్ మేరీ చంద్రిక, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల సమగ్ర నిర్వహణతో పర్యావరణ రక్షణ



కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీసీబీ చైర్మన్ సమీర్ శర్మ

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ సమీర్ శర్మ

సాక్షి, అనకాపల్లి: వ్యర్థాల సమగ్ర నిర్వహణతో మాత్రమే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) చైర్మన్ సమీర్ శర్మ అన్నారు. ప్రమాదకర మెడికల్ వ్యర్థాల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రులు, లేబరేటరీలు వ్యర్థాల విభజనలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఘన, ద్రవ, రసాయన, ప్లాస్టిక్ వ్యర్థాలను ఆరంభంలోనే వేరు చేసి, నిబంధనల మేరకు వాటిని నాశనం చేయాలన్నారు. ముఖ్యంగా రసాయనిక వ్యర్థాల నిర్వహణను పూర్తి అవగాహనతో చేపట్టాలన్నారు. సిరంజ్‌లు, సీసాలు, రసాయన బ్యాగులు, ప్లాస్టిక్ సంచులను వేరు చేసి వాటిలో ఉన్న ప్రమాదకర రసాయనాలను పూర్తిస్థాయిలో నాశనం చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. హానికర, రసాయన వ్యర్థాలు ఎక్కువగా వచ్చే ఆస్పత్రులు, మందుల షాపులు, లేబరేటరీలలో సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆస్పత్రి యాజమాన్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి జిల్లాలో వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా జరుగుతుందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వ్యర్థాల నిర్వహణ గురించి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.10 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 20 రోజులకు కోటి 10 లక్షల 29 వేల 970 రూపాయలు వచ్చినట్టు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రికసదన్‌లో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 5 గ్రాముల బంగారం, 7.050 కిలోల వెండి వచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే 33 యూఎస్‌ఏ డాలర్లు, 148 మలేషియా రింగ్స్, 55 ఆస్ట్రేలియా డాలర్స్, 105 సౌదీ అరేబియా రియాల్స్, 125 యూఏఈ దిర్హామ్స్ లభించినట్టు తెలిపారు.

తిరుపతి వెళుతున్న ప్రైవేట్ బస్సు బోల్తా



బోల్తా పడిన బస్సు



కొత్తపోలవరంలో ఆందోళనలో గ్రామస్తులు

- 12మంది ఎస్.రాయవరం మండలవాసులకు గాయాలు

పెళ్లకూరు (తిరుపతి జిల్లా)/ఎస్.రాయవరం: తిరుపతి జిల్లా నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై పెళ్లకూరు వద్ద మంగళవారం వేకువజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలానికి చెందిన 12 మంది గాయపడ్డారు. వివరాలు.. ఎస్.రాయవరం మండలం గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామానికి చెందిన 23 మంది శ్రీవారి భక్తులు తిరుమలకు బస్సులో బయలుదేరారు. మార్గం మధ్యలో ముందు వెళుతున్న వాహనాన్ని బస్సు అధిగమించబోయి, ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 12 మంది గాయపడగా వారిలో పల్లా వరహాలమ్మ, రమణమ్మ, అవ్వా రమణమ్మ, నాగమణిలకు తీవ్ర గాయాలయ్యాయి.

దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ హుటాహుటిన తమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంప్రదాయబద్ధంగా జోగు దండుకొని ఐదు రోజుల యాత్రకు బస్సు మాట్లాడుకొని సోమవారం మధ్యాహ్నం వారంతా కుటుంబాలతో బయలుదేరినట్టు కొత్తపోలవరం గ్రామస్తులు పోలీసులకు తెలిపారు.

మత్స్యకారులకు మంచి రోజులు

- నీరు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో చేపల పెంపకం
- ఈ ఏడాది 24 లక్షల చేప పిల్లల విడుదల లక్ష్యం
- ఇప్పటికే జలాశయాల్లో 13 లక్షల చేపల పిల్లల విడుదల
- జిల్లాలోని 950 మంది మత్స్యకారులకు మేలు

సముద్రం మీద ఆధారపడే మత్స్యకారులకు వేట నిషేధ సమయం మినహా.. ఏటా చేతి నిండా పని. మరి మిగిలిన చోట్ల జాలర్లు బతికేదెలా? అందుకే సీఎం జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం జలాశయాల్లో చేపపిల్లల్ని వదులుతూ జాలర్ల జీవనోపాధి పెంపునకు దోహదపడుతోంది. అందులో భాగంగానే జిల్లాలోని జలాశయాల్లో ఈ ఏడాది 24 లక్షల చేప పిల్లల్ని వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 13 లక్షల చేపపిల్లల్ని వదిలారు. బుధవారం మరో 8.40 లక్షల చేప పిల్లల్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా విడిచిపెట్టనున్నారు.



తాండవ జలాశయంలో చేప పిల్లల్ని విడుదల చేస్తున్న దృశ్యం(ఫైల్)



వదలడానికి సిద్ధం చేసిన చేప పిల్లలు

గొలుగొండ: మత్స్యకారులకు మంచి రోజులు వచ్చాయి. జిల్లాలో 47 చెరువులు, మూడు భారీ జలాశాయల్లో 24 లక్షల చేప పిల్లల్ని విడిచిపెట్టి, వాటి ద్వారా మత్స్యకారుల జీవనోపాధి పెంచే చర్యలు చేపట్టారు. తాండవ, రైవాడ, కోనాం వంటి పెద్ద జలాశాయాల్లో చేప పిల్లల్ని దలడంతో జాలర్లకు ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా 950 మంది జాలర్లకు లబ్ధి చేకూరనుంది.

శతశాతం రాయితీతో చేప పిల్లలు

పెద్ద జలాశయాలు, చిన్న చెరువుల్లో చేపల పిల్లల విడుదల వలన జాలర్లకు లబ్ధి చేకూరుతుంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) పథకంలో కేంద్రం 60 శాతం, జాలర్ల వాటా 40 శాతం రాష్ట్ర మత్స్యశాఖ భరిస్తూ స్థానిక మత్స్య క్షేత్రాల్లో చేప పిల్లల్ని పెంచి, శతశాతం రాయితీతో జాలర్లకు అందిస్తోంది. జిల్లాలో పెద్ద జలాశయంగా పేరున్న తాండవ జలాశయంలో నాలుగు రోజులు క్రితం 8.39 లక్షల చేప పిల్లల్ని విడుదల చేశారు. నర్సీపట్నం డివిజన్‌లోని రావణాపల్లి జలాశయంలో 68 వేల చేప పిల్లల్ని వదిలారు. రైవాడ వద్దనున్న తాడిపూడి, నాతవరంలోని తాండవ వద్ద మత్స్యశాఖ క్షేత్రాల్లో మరో 5 లక్షల చేప పిల్లలు పెంచి, వాటిని విడుదలకు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

950 మంది మత్స్యకారులకు లబ్ధి

ఈ ఏడాది 47 చెరువులు, మూడు పెద్ద జలాశయాల ద్వారా మత్స్యశాఖ 24 లక్షల చేప పిల్లల విడుదలకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గడచిన నెల రోజుల్లో చెరువులు, తాండవ, రావణాపల్లి జలాశయాల్లో 13 లక్షల చేప పిల్లల్ని విడదల చేశారు. జిల్లా వ్యాప్తంగా లైసెన్సు పొందిన మత్స్యకారులు 950 మంది ఉన్నారు. అంగుళం నుంచి రెండు మూడు అంగుళాల పరిమాణం వరకు చేప పిల్లల్ని జలాశయాల్లో విడిచిపెడతారు. వాతావరణం బట్టి 4 నుంచి 6 నెలల్లో కేజీ వరకు చేప పెరుగుతుంది. చేప పిల్లల్ని వదిలిన నాలుగు నెలల వరకు చిన్న ఉచ్చుల వలలు వేయడాన్ని అధికారులు నిషేధించారు.

మా జీవనోపాధికి భరోసా

జలాశయాల్లో చేప పిల్లల్ని వదలడం వల్ల మాలాంటి జాలర్లకు ఎంతో మేలు జరుగుతుంది. దీని కారణంగా ఆరు నెలల్లో చేపపిల్ల పెరుగుతుంది. వాటిని పట్టుకుని మార్కెట్లో విక్రయించడం ద్వారా ఆదాయం వస్తుంది.

– దేముడు, జాలరి, వెంకటాపురం

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధి కృషి చేస్తున్నాం. పీఎంఎంఎస్‌వైలో 3.40 లక్షలు, తాటిపూడి హేచరీ నుంచి 5 లక్షల చేప పిల్లల్ని సేకరించాం. వీటిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా బుధవారం రైవాడ జలాశయంలో వదలనున్నాం. మరో 2 లక్షల చేప పిల్లల్ని చెరువుల్లో వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నాం. .

– ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా మత్స్యశాఖ

క్లుప్తంగా

రూ. 40 లక్షలతో చోడవరం సీహెచ్‌సీ అభివృద్ధి

• ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



చోడవరం ఆస్పత్రిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి పూర్తి చర్యలు చేపట్టామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఇక్కడ సదరు ఆస్పత్రిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో అన్ని వార్డులను కలియతిరిగారు. ఎక్స్‌రే యూనిట్, ఇతర విభాగాల్లో అవసరమైన పరికరాలు, సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రూ. 40 లక్షలతో ఆస్పత్రి అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామన్నారు. అదేవిధంగా ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, వైద్యాధికారి వినయ్, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం తగదు



చిన్నారులతో ముచ్చటిస్తున్న కమిటీ చైర్‌పర్సన్ అనురాధ

దేవరాపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని ఉమ్మడి విశాఖ జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ అన్నారు. మండలంలోని బోయిలకింతాడ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం సక్రమంగా అందించడం లేదని స్థానికులు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని గ్రామానికి విచ్చేసిన ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆమె సదరు కేంద్రాన్ని సందర్శించారు. పౌష్టికాహార కిట్లు ఎందుకు సక్రమంగా పంపిణీ చేయడం లేదని అంగన్‌వాడీ కార్యకర్త రోజారమణిని ప్రశ్నించారు. రికార్డులను సైతం తనిఖీ చేశారు. మిగిలిన లబ్ధిదారులకు తక్షణమే పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతాయారు, సూపర్‌వైజర్ ఆదిలక్ష్మిలను ఆదేశించారు. పంపిణీ ప్రక్రియ పూర్తయ్యాక అనురాధ అక్కడి నుంచి వెళ్లారు. తొలుత చిన్నారులతో కొద్ది సేపు ముచ్చటించారు.

ప్రణాళికాయుతంగా గ్రామాల అభివృద్ధి

• ఎంపీ బీవీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్నఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలను ప్రణాళికా యుతంగా అభివృద్ధి చేయాలని ఎంపీ బి.వి.సత్యవతి అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన(ఎస్ఏజీవై) సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడం, విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, ప్రజల ఆరోగ్యం, అభివృద్ధి, వివిధ రంగాల అభివృద్ధితో పాటు అందరికీ సంపాదన, ఉద్యోగభద్రత, ఎన్ఆర్ఈజీఎస్, ఆరోగ్యశ్రీ సంపూర్ణ బీమా కార్డులు, పింఛన్లు మొదలైనవి కల్పించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే వివిధ రకాల నిధులను ఉపయోగించి గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ వివిధ గ్రాంట్లతో చేపట్టే పనులు ప్రణాళికా యుతంగా రూపొందించుకోవాలన్నారు. వివిధశాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన వాటిపై తగిన దృష్టి కేంద్రీకరించాలన్నారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో ఆయన వివిధ మండలాలలో చేపట్టిన కార్యక్రమాలతోపాటు జిల్లా అభివృద్ధి, సమన్వయం పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశంలో సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, సీపీవో జి.రామారావు, ఈఈ వీరన్నాయుడు, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, డీపీవో శిరీషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మిపతి, డీఈవో వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించేది క్రీడాకారులే..

• ఎస్పీ మురళీకృష్ణ



బాలుర విభాగంలో గెలుపొందిన శ్రీప్రకాష్ విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

పాయకరావుపేట: గెలుపు ఓటమిలు సమానంగా స్వీకరించే సత్తా క్రీడాకారుడికే ఉందని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్ -7 ఖోఖో పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణా నుంచి 1,200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ ఇక్కడకు అతిథిగా రావడంతో తన స్కూల్ రోజులు జ్ఞాపకం వస్తున్నాయన్నారు. ఆటల్లో భాగస్వాములు కాలేని విద్యార్థులు జీవితంలో సంపూర్ణమైన అభివృద్ధి సాధించలేరని అభిప్రాయపడ్డారు. క్రీడల ద్వారా ఎన్నో రకాల విషయాలు నేర్చుకోవచ్చునన్నారు. ఓటమి చెందినవారు తర్వాత గెలుపు దిశగా పయనిస్తారని, గెలిచిన వారు ఎప్పుడోకప్పుడు ఓటమి చవి చూస్తారన్నారు. నేర్చుకునే ప్రతిభ క్రీడలా ద్వారానే సాధ్యమవుతుందని, కలిసికట్టుగా పోరాడితేనే విజయం దక్కుతుందన్నారు. ఈ విషయం విద్యార్థులకు క్రీడా స్ఫూర్తితోనే అలవడుతుందన్నారు. పాఠ్య పుస్తకాల్లో కంటే బాహ్య ప్రపంచం నుంచే చాలా విషయాలు నేర్చుకోవాలని, దీనిని మించిన ఉత్తమ అభ్యాస వేదిక లేదన్నారు. విద్యార్థి దశలో మిక్కిలి అభిరుచితో నేర్చుకుంటేనే రాణిస్తారని, ఆటలలోనైనా, చదువులోనైనా పునాది చాలా ముఖ్యమని, మంచి పౌరులుగా రూపొందడానికి సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళిక సరైన రీతిలో దోహదపడుతుందని వివరించారు. ప్రేరణ ఇచ్చే ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, అబ్జర్వర్ జి.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ ఆఫ్ ఖోఖో ఫెడరేషన్ సిహెచ్.ఎల్.ఎం. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, నీలాదేవి, పీఈటీలు, రిఫరీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

• సామాన్యులకు శ్రీరామరక్ష



కశింకోట మండలం కొత్తపల్లి హైస్కూల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పక్షవాతం రోగి శారద వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్న డాక్టర్ గౌతమి, వైద్య సిబ్బంది



దేవరాపల్లి మండలం బోయిలకింతాడలో మానసిక దివ్యాంగ బాలుడికి మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ రాజేశ్వరి

ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాయుడుబాబు

నర్సీపట్నం: ఏపీ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నర్సీపట్నం మున్సిపాలిటీలో పని చేస్తున్న ఎస్.నాయుడుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన ఎన్నికల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఇక్కడ సహచర ఉద్యోగులు అభినందించారు.

ఆకట్టుకుంటున్న నాటికలు



'ఘంటసాల నాటిక' ప్రదర్శన

అనకాపల్లిటౌన్: గవరపాలెం సతకంపట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని గౌరీ సేవాసంఘం మళ్ల జగన్నాథరావు కల్యాణమండపంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవ పోటీలు మూడోరోజు మంగళవారం జరిగాయి, నాటిక పోటీలను కనకదుర్గ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ దాడి జయవీర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ స్టేషన్ ఘనాపూర్ శ్రీసాయి సంతోషి నాట్యమండలి(సురభి) వారు ప్రదర్శించిన 'ఘంటసాల నాటిక' ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రచన, దర్శకత్వం భాస్కరుని సత్య జగదీష్ నిర్వహించారు. అలాగే విజయవాడ మైత్రి కళానిలయం ప్రదర్శించిన 'ఇతిహాసం' నాటిక ప్రేక్షకులను అలరించింది. అమ్మ గొప్పతనాన్ని చాటి చెప్పే ఈ నాటిక రచన శ్రీస్నిగ్ధ, దర్శకత్వం పురుషోత్తం నిర్వహించారు.

షీలానగర్–సబ్బవరం హైవేకి కదలిక!

• నెలాఖరుకల్లా టెండర్లకు ఆహ్వానం
• నాలుగు నుంచి ఆరు వరుసలకు పెంపు
• ప్రాజెక్టు వ్యయం రూ.980 కోట్లు
• రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం



సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరానికి ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, వైజాగ్ పోర్టుకు భారీ వాహనాల రాకపోకలు సజావుగా సాగడానికి ఉద్దేశించిన షీలానగర్–సబ్బవరం హైవేకి కదలిక వచ్చింది. రోజురోజుకు నగరంతో పాటు పోర్టుకు వాహనాల తాకిడి అధికమవుతోంది. అనకాపల్లి నుంచి కూర్మన్నపాలెం, గాజువాకల మీదుగా షీలానగర్ వరకు ట్రాఫిక్ రద్దీ చాలా ఎక్కువగా ఉంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సుమారు ఎనిమిదేళ్ల క్రితం సాగరమాల పథకంలో ప్రత్యేకంగా ఈ రోడ్డును మంజూరు చేసింది. తొలుత నాలుగు వరసల్లో 12.5 కిలోమీటర్ల మేర దీనిని నిర్మించడానికి ప్రతిపాదించింది. ఇందుకు రూ.350 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. దీని నిర్మాణ బాధ్యతను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు అప్పగించింది. రోడ్డు నిర్మాణానికి సుమారు 80 హెక్టార్ల భూమిని సేకరించాల్సి వచ్చింది. ఈ రోడ్డు పనులు చేపట్టేందుకు సన్నద్ధమయ్యే సమయంలో భూసేకరణతో పాటు ఇతరత్రా పలు అవాంతరాలెదురయ్యాయి. దీంతో ఈ రోడ్డు నిర్మాణ ప్రక్రియలో జాప్యం జరుగుతూ, వాయిదా పడుతూ వచ్చింది. క్రమంగా అడ్డంకులను ఒక్కొక్కటిగా అధిగమించడంతో ఇప్పుడు దీని నిర్మాణానికి మార్గం సుగమం అయింది. మొదట నాలుగు వరుసల్లో నిర్మించాలని నిర్ణయించినప్పటికీ పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా ఆరు లేన్లకు పెంచారు. అంతేకాదు.. సబ్బవరం బైపాస్ రోడ్డును కూడా దీనిలోనే కలిపారు. దీంతో పాటే దీని అంచనా వ్యయాన్ని కూడా రూ.350 కోట్ల నుంచి రూ.980 కోట్లకు పెంపుదల చేశారు. షీలానగర్–సబ్బవరంల మధ్య అవసరమైన చోట ఫ్లైఓవర్లను కూడా నిర్మించనున్నారు.

నెలాఖరుకల్లా టెండర్లు

షీలానగర్–సబ్బవరం హైవే నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లకు పెంపుదలపై ఇప్పటికే డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు. ఈ రోడ్డుకు అన్ని అడ్డంకులు తొలగడంతో నెలాఖరుకల్లా ఎన్‌హెచ్ఏఐ అధికారులు టెండర్లు పిలవడానికి సన్నద్ధమవుతున్నారు. టెండర్ల ఖరారు అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపడతారు. రెండేళ్లలో ఆరు వరసల్లో ఈ రోడ్డును పూర్తి చేయనున్నారు. ఈ హైవేను అనకాపల్లి–ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారికి అనుసంధానం చేస్తారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే అనకాపల్లి, సబ్బవరం జంక్షన్, షీలానగర్, కాన్వెంట్ జంక్షన్, పోర్టు సహా కంటైనర్ టెర్మినల్ వరకు భారీ వాహనాలు, లారీలు, కంటైనర్లు నేరుగా ఈ హైవేపైనే రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఇన్నాళ్లూ అనకాపల్లి–ఎన్ఏడీ జంక్షన్ల మధ్య షీలానగర్, గాజువాక, కూర్మన్నపాలెం, లంకెలపాలెంల మీదుగా వెళ్లే వాహనాలు ఎన్‌హెచ్–16పై ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి వాహనచోదకులకు ఉపశమనం కలగనుంది.

రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి పరుగులు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

• ఆర్బీకేను ప్రారంభించిన విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: మండలంలోని చీమలపాడు గిరిజన గ్రామంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ముందుగా ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నూతనంగా నిర్మించిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వంజరి గంగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతోపాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. దేశంలో మన రాష్ట్రం ఎన్నో రంగాల్లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఏపీని ఎన్నో రాష్ట్రాలు రోల్ మోడల్‌గా తీసుకుంటున్నాయన్నారు. చీమలపాడు పంచాయతీలో 19 గిరిజన గ్రామాల రైతులు ఏ అవసరమున్నా కొత్తకోట వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై యూరియా, విత్తనాలు, వ్యవసాయ సలహాలు, సూచనలు, తదితర సేవలు ఇక్కడి రైతు భరోసా కేంద్రంలోనే లభ్యమవుతాయన్నారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్ని చినమ్మలు, ఎంపీపీ పైల రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, మాజీ సర్పంచ్ వంజరి సత్యనారాయణ పాల్గొన్నారు.

'రాజేష్ మృతిపై దర్యాప్తు చేయాలి'



చోడవరం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు మధుబాబు

చోడవరం : సోమాదుల రాజేష్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు నమోదైన కేసును హత్యగా కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయాలని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు డిమాండ్ చేశారు. మృతుడి తల్లి సోమాదుల కృపకు మద్దతుగా మధుబాబు చోడవరం తహసీల్దార్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల చోడవరం మండలం గజపతినగరం సమీపంలో రాజేష్ మృతిచెందగా రోడ్డు ప్రమాదంగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై యువకుడి తల్లి కృప పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ తన కుమారుడుని హత్య చేసి రోడ్డుపై పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని ఆమె కోరారు. ఆమెకు మద్దతుగా జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు మధుబాబు ఈ కేసును తిరిగి దర్యాప్తు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ తిరుమలబాబు స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అంతేకాకుండా కృపను పంచాయతీ స్వీపర్‌గా విధుల నుంచి తొలగించడంపై కూడా ఆయన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాము కాటుకు ఇద్దరు మహిళల మృతి



పరదేశమ్మ(ఫైల్)



చిటిమిరెడ్డి లక్ష్మి (ఫైల్)

రావికమతం/దేవరాపల్లి: పాముకాటుతో రావికమతం, దేవరాపల్లి మండలాల్లో మంగళవారం ఇద్దరు మహిళలు మృతి చెందారు. కొత్తకోట గ్రామానికి చెందిన మంజేటి పరదేశమ్మ (50) పాము కాటుకు గురై మృతి చెందింది. ఇంటింటికీ కరివేపాకు విక్రయించే ఆమె ఉదయం పొలానికి వెళ్లింది. అక్కడ కరివేపాకు కోస్తుండగా, చెట్ల మధ్యలో పాము కాటు వేసింది. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందింది. నిరుపేద దళిత కుటుంబం కావడంతో కొత్తకోట సీఐ ఆమె దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.2 వేలు సాయం చేశారు.

పరదేశమ్మ, రాజులు కుమారుడు లోవ రెండేళ్ల క్రితం ప్రమాదవశాత్తు చెట్టు మీద పడి మృతి చెందాడు. భరించలేని ఆ దుఃఖాన్ని ఇంకా మర్చిపోకముందే పాముకాటుకు గురై భార్య మృతి చెందడంతో రాజులు కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది.

కాశీపురంలో..

దేవరాపల్లి మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన మహిళా రైతు చిటిమిరెడ్డి లక్ష్మి (50) పాము కాటుకు గురై మంగళవారం రాత్రి చెందారు. ఆమె భర్త వెంకటరావు కథనం మేరకు.. ఆమె పొలంలో సాయంత్రం గడ్డి కోస్తుండగా పాము కాటు వేయడంతో ఆమె అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. వెంటనే స్థానికులు దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కె.కోటపాడు కమ్యూనిటీ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మార్గం మధ్యలో మరణించింది. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు. సాయంత్రం వరకు అందరితో కలిసి ఉన్న పాముకాటుతో మృతి చెందడంతో కాశీపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

టీ-20 మ్యాచ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో సీపీ రవిశంకర్, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

• నవంబర్ 23న భారత్– ఆస్ట్రేలియా మ్యాచ్
• సాగరతీరంలో భారీ స్క్రీన్ ఏర్పాటుకు సన్నాహాలు
• అన్ని శాఖల సమన్వయంతో మ్యాచ్‌ను నిర్వహిస్తాం
• మ్యాచ్ నిర్వాహక కమిటీ సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: విశాఖ వేదికగా నవంబర్ 23న జరిగే భారత్–ఆస్ట్రేలియా తొలి టీ–20 క్రికెట్ మ్యాచ్ జోష్ అప్పుడే మొదలైంది. ఆస్ట్రేలియాతో మ్యాచ్ అంటే భారీగా అభిమానులు తరలివస్తారు. వైఎస్సార్ ఏసీఏ, వీడీసీఏ క్రికెట్ స్టేడియం సామర్థ్యం 27 వేలు. మరి టికెట్లు దొరకని వారి పరిస్థితి ఏంటి? అందుకే ఈ సారి ఐపీఎల్ తరహాలో సాగరతీరంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుకు క్రికెట్ సంఘం సన్నాహాలు చేస్తోంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో టికెట్లను పకడ్బందీగా విక్రయించాలని మ్యాచ్ నిర్వాహక కమిటీ నిర్ణయించింది. స్టేడియంలో మంగళవారం మ్యాచ్ నిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

పూర్తి సహకారం అందిస్తాం

ప్రపంచ క్రికెట్ కప్ పూర్తయిన తర్వాత భారత్, ఆస్ట్రేలియా జట్లు టీ–20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌ను విశాఖ వేదికగా ఆడనున్నాయి. ఇంకా నెల రోజులకు పైగానే సమయం ఉన్నా.. ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించామని కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశంపై సమీక్ష చేసినట్లు చెప్పారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతూ.. టికెట్ల విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడతామన్నారు. మ్యాచ్ సజావుగా సాగేందుకు అధికార యంత్రాంగం బీసీసీఐ, ఏసీఏకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఆటగాళ్ల కోసం గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తామని వివరించారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ ఇరుజట్ల ఆటగాళ్ల భద్రతతో పాటు ప్రజలు, అభిమానుల బాధ్యత తీసుకుంటామన్నారు. ప్రవేశానికి తగిన ఏర్పాట్లతో పాటు మ్యాచ్ పూర్తయిన వెంటనే ట్రాఫిక్ నియంత్రించేందుకు సమీక్ష చేశామన్నారు. నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అభిమానులకు అసౌకర్యం లేకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. టికెట్ల విక్రయ కౌంటర్ల వద్ద తగిన భద్రత కల్పిస్తామన్నారు.

అన్ని రాష్ట్రాల ప్రతినిధులను ఆహ్వానిస్తాం

మ్యాచ్ నిర్వహణ, ఏర్పాట్లపై కమిటీ పూర్తిస్థాయిలో చర్చించిందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. స్టేడియంలోకి ఆహార పదార్థాలు, పారిశుధ్యం, మంచినీరు సరఫరా తదితర ఏర్పాట్లు చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన క్రికెట్ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను మ్యాచ్ చూసేందుకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అభిమానులను దృష్టిలో పెట్టుకుని ఐపీఎల్ తరహాలో సాగరతీరంలో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేసేందుకు కమిటీ నిర్ణయించిదని వివరించారు.

క్లుప్తంగా

డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలి


మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద జరుగుతున్న కాలువ పనులు

అనకాపల్లిటౌన్: పట్టణ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల దృష్ట్యా ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదానది బ్రిడ్జి వరకూ, పూడిమడక జంక్షన్ నుంచి గుండాల జంక్షన్ వరకూ ఫుట్‌పాత్‌లు, రహదారి పనులు జరుగుతున్నాయని, పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఫుట్‌పాత్‌లు, కాలువలు, రహదారిపై వ్యాపారాలు చేస్తున్న బడ్డీలు, ఇతర సామాగ్రిని తక్షణమే తొలగించాలని సూచించారు. ఇప్పటికే వేల్పులవీధి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యతో నిత్యం ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలన్నారు.

సత్యదేవ్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం

అనకాపల్లి టౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దరి సత్యదేవ్ ఆస్పత్రిలో క్యాన్సర్ వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి అధినేత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు తెలిపారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రి(ముంబై)లో రిజిస్ట్రార్‌గా పనిచేసిన డీఎన్‌బీ క్లినికల్, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ వంగ వంశీమోహన్ ఇక్కడి రోగులకు వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి


కృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్థానికులు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉగ్గిన గంగునాయుడు సేవా సంఘం అధ్యక్షుడు ఉగ్గిన రమణమూర్తి, పాల సంఘం కార్యదర్శి జెర్రిపోతుల నూకినాయుడు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 1,012 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,180	4,590
రెండో రకం	3,850	4,170
మూడోరకం	3,600	3,840

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–18 యూనిట్లు, బీ పాజిటివ్–14 యూనిట్లు, ఓ పాజిటివ్–11 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 433 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.


గజలక్ష్మీదేవిగా గౌరీదేవి


గాయత్రీదేవిగా సతకంపట్టు కనకదుర్గమ్మ


ధనలక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరి


గాయత్రి అలంకరణలో సత్యనారాయణపురం దుర్గమ్మ


అన్నపూర్ణ అలంకరణలో కశింకోట హైవే కనకదుర్గమ్మ


నూకాంబిక ఆలయంలో మన్యుపాశుపతహోమంలో పాల్గొన్న ధర్మకర్త కొండూరు రవీంద్ర దంపతులు


కామాక్షిదేవి సన్నిధిలో కుంకుమ పూజలు


శివశక్తి ఫ్రెండ్స్ క్లబ్ ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ సన్నిధిలో లక్ష్మీనరసింహారావు

గాయతాం త్రాయతే ఇతి గాయత్రి

- ధనలక్ష్మి, గజలక్ష్మి, గాయత్రి అలంకరణలో దుర్గమ్మ
- నూకాంబిక ఆలయంలో మన్యుపాశుపత అభిషేకం, హోమం
- అమ్మవారి ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు

గాయతాం త్రాయతే ఇతి గాయత్రి.. గానంతో కొలిచే వారిని రక్షించేది గాయత్రి అని ఉవాచ. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన మంగళవారం అమ్మవారిని పలు దేవాలయాలు, మండపాల్లో గాయత్రీదేవిగా అలంకరించి భక్తితో కొలిచారు. కొన్నిచోట్ల స్థానిక సంప్రదాయాల మేరకు ధనలక్ష్మి, గజలక్ష్మి రూపంలో కూడా అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. జై దుర్గ.. జైజై దుర్గ నామస్మరణతో హోరెత్తించారు.

అనకాపల్లిటౌన్: పట్టణం, మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి దేవాలయాలు, మండపాలు దేవీ నామస్మరణతో మార్మోగాయి. మహిళలు, భవానీ మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

నూకాంబిక బాలాలయంలో..
ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతిపూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం మన్యుపాశుపత అభిషేకం, హోమాలను ధర్మకర్త కొండూరు రవీంద్ర ఇంద్ర దంపతులు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా సతకంపట్టు కనకదుర్గమ్మ
స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయగిరి చంద్రశేఖర్ అమ్మవారికి అవతారాల అలంకరణ చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆర్థిక సాయంతో భవానీ మాలాధారులకు అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి రథయాత్రను పట్టణ పురవీధుల గుండా జరిపారు.


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

గజలక్ష్మిగా గౌరీపంచాయతన అమ్మవారు
గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవిని గజలక్ష్మిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ మండపంలో సామూహిక సహస్ర నామ పూజలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.


గౌరీపంచాయతన ఆలయంలో ధనలక్ష్మి పూజలో పాల్గొన్న మహిళలు

కామాక్షిదేవికి ధనలక్ష్మి అలంకరణ
నిదానందొడ్డి కామాక్షమ్మ ఆలయంలో కామాక్షిదేవి భక్తులకు ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. భవానీ భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేపట్టారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి
స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశాఖ ఉక్కునగరానికి చెందిన పి.దుర్గారావు బృందంచే సుందరకాండ పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, భక్తులు పాల్గొన్నారు.

శివశక్తి ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ
దసర శరన్నవరాత్రిని పురస్కరించుకుని గవరపాలెం శివశక్తి ఫ్రెండ్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ, సతకంపట్టు కనకదుర్గమ్మలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాయత్రీదేవిగా కనకదుర్గమ్మ
అనకాపల్లి రూరల్: మండలంలోని సత్యనారాయణపురం కొండపై కొలువుదీరిన కనకదుర్గమ్మను గాయత్రీదేవిగా అలంకరించారు. మంగళవారం వేకువజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి ధర్మాచార్యుల నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక కుంకుమ పూజలు జరిగాయి. ఏలూరు అదనపు ఎస్పీ కరణం కుమార్ వేకువజామునే అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు. అలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీ, మేడిశెట్టి సత్తిబాబు తదితరులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో వీరబ్రహ్మంగారి గుడివద్ద శరన్నవరాత్రుల్లో భాగంగా భవానీ భక్తులకు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వెంకట సత్యవతి, ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన శ్రీనివాసరావు, సభ్యులు రాజనాల శ్రీకాంత్, అల్లు రమణమ్మ, పలకా కాసులు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక జాతీయ రహదారి పక్కన వెలసిన ఆలయంలో కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణదేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అన్నపూర్ణదేవి అవతారంగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఎక్కువగా భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 38 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదురోజులు ఆస్పత్రిలో వసతితోపాటు, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, వైద్యసహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.


ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రవిరామ్ జవహర్

రైతులను ఆదుకోవాలని వినతి

అనకాపల్లిటౌన్: అతివృష్టి, అనావృష్టితో కుదేలైపోతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్ కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు మంగళవారం వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో వేదిక సభ్యులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బండి అప్పారావు, బొబ్బిలి గోవిందరావు, సూరిశెట్టి రామచంద్రరావు, ముగడ అప్పారావు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

అనకాపల్లిటౌన్: పట్టణ పరిధి గొల్లవీధి యూపీహెచ్‌సీ, మండలంలోని శంకరం గ్రామం, ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూపీహెచ్‌సీలో మూడో రోజు 11, 12 సచివాలయాల పరిధి ప్రజలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఒక్కో వైద్య శిబిరానికి నలుగురు చొప్పున 8 మంది స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తార తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి, ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. కంటిచూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, శస్త్రచికిత్సలకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యూపీహెచ్‌సీ, శంకరం పరిధి ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

పేదలందరికీ మెరుగైన వైద్యం ప్రభుత్వ ధ్యేయం

సబ్బవరం: ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. సబ్బవరం సచివాలయం–4 పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్యంతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందించారు. వైద్య శిబిరంలో 452 మంది పరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్య శిబిరంలో 182 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ, గొర్లి అచ్చెంనాయుడు పాల్గొన్నారు. డాక్టర్ శ్రీనివాసరావు,డాక్టర్ ఆశ,డాక్టర్ రాజీవ్‌తో పాటు వైద్య సిబ్బంది సేవలందించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పోషకాహారంతో కలిగే మేలును వివరించి తక్కువ ఖర్చుతో ఎలా సమకూర్చుకోవచ్చో అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు.

సామాజిక తనిఖీలతో పారదర్శకత

సబ్బవరం: సామాజిక తనిఖీలు చేయడం వల్ల పనుల్లో అవకతవకలకు చెక్ పడడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయని ఎంపీపీ బోకం సూర్యకుమారి చెప్పారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన 16వ విడత మండల స్థాయి సామాజిక తనిఖీల ప్రజా వేదికలో ఆమె ప్రసంగించారు. అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు గుర్తించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

ఉపాధి పథకంలో భాగంగా 1,196 పనులను సామాజిక తనిఖీల్లో పరిశీలించినట్టు చెప్పారు. ఈ పనులకు రూ.10.24 కోట్లు వెచ్చించగా వీటిలో ఉపాధిది కూలీలకు వేతనాల రూపంలో రూ.8.29 కోట్లు, మెటీరియల్‌కు రూ.1.94 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. పనుల్లో రూ.18 వేల వరకూ లోపాలు, లోటు పాట్లు జరిగినట్లు సామాజిక తనిఖీల సిబ్బంది గుర్తించి సభ దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల్లో సిబ్బంది నుంచి రికవరీ చేయాలని విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి ఆదేశించారు.

ఆరోగ్య సురక్షతో గ్రామాల్లోనే మెరుగైన వైద్యం


మూలపేటలో వృద్ధుడికి మందుల కిట్ అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు, నాయకులు


గొల్లవీధి యూపీహెచ్‌సీ వైద్యశిబిరంలో కంటిపరీక్షల కోసం నిరీక్షిస్తున్న రోగులు


ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీ సత్యవతి


ప్రజలను వైద్య శిబిరంలో సేవలపై ఆరా తీస్తున్న ఎంపీ బీవీ సత్యవతి


సత్యనారాయణపురం సచివాలయం పరిధి శిబిరంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి రూరల్: పేద, సామాన్య కుటుంబాలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సత్యనారాయణపురం సచివాలయం–2 పరిధి మూలపేటలో రామాలయం వద్ద వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 512 మంది ఓపీ వైద్య సేవలు పొందారు. వీటిలో జనరల్ 342, ఆప్తాలమిక్ ఓపీ 170 మంది. పలువురికి వైద్యులు బీపీ, బ్లడ్ సుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందుల కిట్లను ఉచితంగా అందించారు. అంతకు ముందు వైద్య శిబిరాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజల ముంగిటకే ఆరోగ్య సేవలందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించినట్లు తెలిపారు. శిబిరంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు చిరు ధాన్యాల వంటకాలతో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఎంఈవో చిట్టిబాబు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ కర్రిమజ్జి అలివేణి, వైఎస్సార్ సీపీ నాయకులు పలకా సత్తిబాబు, కర్రిమజ్జి మల్లేశ్వరరావు, ఉపసర్పంచ్ పొట్టుకూరి అప్పలరాజు, సచివాలయ కన్వీనర్లు పి.ముత్యాలరావు, కర్రిమజ్జి మహలక్ష్మినాయుడు, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చే ప్రజలకు ఆరోగ్యం పట్ల సమగ్ర అవగాహన కల్పించాలని అధికారులు, సిబ్బందికి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి సూచించారు. మండలంలోని కొత్తపల్లి హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. అక్కడ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలను, వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికి ఆరోగ్యాన్ని అందించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. సచివాలయాల్లో నిర్వహిస్తున్న శిబిరాలకు వస్తున్న ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఆరోగ్య సేవల గురించి అవగాహన కలిగించాలన్నారు. అవసరమైన వారిని ఉన్నత వైద్యానికి సిఫార్స్ చేయాలని సూచించారు. శిబిరంలో అందుతున్న సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఒకేచోట వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు తదితర సదుపాయాలతో గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. అక్కడ పదార్థాలను రుచి చూశారు. కంటి పరీక్షల శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మంజులవాణి, ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీడీవో వి.వి.రవికుమార్, వైద్య సిబ్బంది ఎస్.తిరుపతిరావు, యు.రమేష్, సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, ఆర్ఈసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, సర్పంచ్ శ్యామ్, ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి, సూపర్‌వైజర్ ఝాన్సీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు అద్దెపల్లి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- కొత్తపల్లి హైస్కూలులో మంగళవారం నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 435 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 56 మందికి కళ్లద్దాలు, ఐదుగురికి ఆపరేషన్ల కోసం సిఫార్స్ చేశారు. 30 మందికి ఉన్నత వైద్యం అవసరమని నిర్ధారించారు. ప్రకృతి సిద్ధంగా పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి కూండ్రపు అరుణ పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: స్థానిక గొల్లవీధి యూపీహెచ్‌సీలో రెండోరోజైన మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నిచిన్న సమస్యలకు ఇక్కడే వైద్య సేవలు పొందవచ్చన్నారు.


కొత్తపల్లిలో వైద్య సేవల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు


కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి పవన్ కల్యాణ్


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీ సత్యవతి